సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 25 । మార్చి । 2025



సోమశిలలో 54.207 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 54.207 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,195
3శాతం జీఎస్టీతో	రూ.8,441
నవర (8గ్రా)	రూ.67,528

గరిష్టం/కనిష్టం
34.7 /26.8

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 66 శాతంగా నమోదైంది.



మా పోస్టులు మా ఇష్టం!

ఉమ్మడి జిల్లాలో గూడూరు, నెల్లూరులో ఖాళీ ఎయిడెడ్ పోస్టులు

- 10 టీచర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు
- ఇప్పటికే పోస్టుకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వసూలు
- ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు
- ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోర్టుకు వెళ్లిన అసోసియేషన్ నేతలు
- ఈ వారంలో ఎయిడెడ్ పోస్టులకు పరీక్ష జరిగే అవకాశం



నెల్లూరు (టౌన్): జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఆయా యాజమాన్యాలు భారీ మొత్తంలో బేరం పెట్టినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ పోస్టుల కోసం కొంతమంది వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. అయితే నెల్లూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ వారంలో పరీక్ష నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణపై రాష్ట్ర ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ పోస్టులకు సంబంధించి ఆయా అభ్యర్థుల నుంచి పోస్టును బట్టి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే తమ అభ్యర్థులకు పోస్టులు దక్కే అవకాశం ఉండదేమన్న అనుమానంతో ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని కొన్ని యాజమాన్యాలు పట్టుబడుతున్నాయి.

జిల్లాలో 25 ఎయిడెడ్ పాఠశాలలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 23, కందుకూరు డివిజన్‌లో 3 ఎయిడెడ్ పాఠశాలలు జిల్లా విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. కావలిలోని ఎలిమెంటరీ స్కూల్, డీఆర్‌ఎల్‌కేఆర్ వీబీ హైస్కూల్, సమి శేషాచలంశెట్టి విశ్వోదయ గరల్స్ హైస్కూల్, అల్లూరులోని ఎఫ్‌బీసీ యూపీ స్కూల్, రామకృష్ణ జూనియర్ కళాశాల, తలమంచిలోని వీపీసీ యూపీఎస్, నార్తు రాజుపాళెంలోని ఆర్‌సీసీ ఎలిమెంటరీ స్కూల్, బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీహరనాథ ఎలిమెంటరీ స్కూల్, ఉయ్యాలపల్లిలోని ఎస్ఎంఎస్ ఎలిమెంటరీ స్కూల్, నెల్లూరులోని వేద సంస్కృత హైస్కూల్, వేద సంస్కృత ఎలిమెంటరీ స్కూల్, ఏబీఎం ప్రైమరీ స్కూల్, ఎస్‌కేడీసీ ఈఎల్ఈ స్కూల్, వెంకటేశ్వరపురంలోని జీఎంఎం ఈఎల్ఈ, సెయింట్ జోసెఫ్స్ బాలికల ఈఎల్ఈ స్కూల్, శ్రీకస్తూరిదేవి బాలికల హైస్కూల్, సెయింట్ జోసెఫ్స్ బాలికల హైస్కూల్, లేగుంటపాడులోని ఎయిడెడ్ ఈఎల్ఈ స్కూల్, గూడూరులోని రాణిపేట్ ఈఎల్ఈ స్కూల్, జీఎం యూపీ స్కూల్, శ్రీ పొట్టి శ్రీరాములు యూపీ స్కూల్, వెంకటగిరిలోని ఆర్‌వీఎం హైస్కూల్, సూళ్లూరుపేటలోని ఎస్ఎంసీ ఈఎల్ఈ స్కూల్, కందుకూరు డివిజన్ కరేడులోని జీఎస్ఎస్‌టీ ప్రైమరీ, హైస్కూల్స్ ఉన్నాయి.

10 ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్

ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచరు పోస్టుకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆయా ఎయిడెడ్ పాఠశాలల్లో 20 మంది ఉపాధ్యాయులు మిగులు ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు తేల్చింది. మిగులు ఉపాధ్యాయులను కొరత ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు ఆయా ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం అంగీకరించలేదు. దీంతో నెల్లూరులోని కస్తూరిదేవి బాలికల హైస్కూల్, గూడూరులోని శ్రీ పొట్టిశ్రీరాములు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. కస్తూరిదేవి బాలికల హైస్కూల్‌లో 7 పోస్టులు, శ్రీ పొట్టిశ్రీరాములు స్కూల్‌లో 3 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. కస్తూరిదేవి స్కూల్‌లో పోస్టులకు ఆన్‌లైన్‌లో 509, ఆఫ్‌లైన్‌లో 287, ఏడాది క్రితం వచ్చిన దరఖాస్తులు 396 కలిపి మొత్తం 1192 దరఖాస్తులు వచ్చాయి. శ్రీ పొట్టిశ్రీరాములు స్కూల్‌లో 3 పోస్టులకు ఆన్‌లైన్‌లో 337, ఆఫ్‌లైన్‌లో 79 కలిపి మొత్తం 416 దరఖాస్తులు వచ్చాయి.

పరీక్ష ఎప్పుడంటే..

కస్తూరిదేవి, శ్రీ పొట్టిశ్రీరాములు స్కూల్స్‌లో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ వారంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిసింది. పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే కస్తూరిదేవి స్కూల్ యాజమాన్యానికి ఆఫ్‌లైన్‌లో వచ్చిన 287 దరఖాస్తులను రిక్రూట్‌మెంట్ అధికారి నెల్లూరు డిప్యూటీ డీఈఓకు పంపించాల్సి ఉంది. ఎన్నిసార్లు కబుర్లు పంపినా ఆ దరఖాస్తులు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించలేదని తెలిసింది.

పోస్టును బట్టి నగదు వసూలు

కస్తూరిదేవి బాలికల హైస్కూల్‌లో ఆ యాజమాన్యం పోస్టును బట్టి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. నిర్వహించే పరీక్ష నామమాత్రంగానే ఉంటుందని పోస్టింగ్ ఇచ్చే బాధ్యత తమదని చెప్పి ముందే కొంతమంది నుంచి డబ్బులు వసూలు చేశారన్న ప్రచారం ఉంది. సెకండరీ గ్రేడు టీచరుకు రూ.15 లక్షలు, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.25 లక్షలు, పీఈటీకి రూ.10 లక్షలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే తాము డబ్బులు తీసుకున్న వారికి పోస్టు రాకపోతే



పరిస్థితి ఏంటన్న ఆలోచనలో ఆ యాజమాన్యం ఉన్నట్లు తెలిసింది. ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేలా ఎయిడెడ్ యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఈ వారంలో పరీక్ష ఉండే అవకాశం

ఎయిడెడ్ స్కూల్స్‌లో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ వారంలో పరీక్ష ఉండే అవకాశం ఉంది. పరీక్షకు సంబంధించి అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసే పనిలో ఉన్నాం. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పరీక్ష నిర్వహిస్తాం.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

న్యూస్‌రీల్

మేజర్ మినరల్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న సీనియర్ జియాలజిస్ట్ కార్తికేయన్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని మైనింగ్ లీజుదారులు మైనర్ నుంచి మేజర్ మినరల్‌కు మారేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ సీనియర్ జియాలజిస్టు కార్తికేయన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయంలో మైనింగ్ లీజుదార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ నుంచి మేజర్‌కు మారేందుకు కావాల్సిన పత్రాలపై లీజుదార్లకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మైనింగ్ లీజుదారుల అసోసియేషన్ అధ్యక్షులు ద్వారకానాథ్‌రెడ్డి, మైనింగ్ డీడీ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లి వేలం కేంద్రంలో 545 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 545 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 565 బేళ్లు రాగా వాటిలో 545 బేళ్లను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260 లభించింది. సగటు ధర రూ.274.82గా నమోదైంది. వేలంలో 71,698 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,97,04,072 వ్యాపారం జరిగింది. వేలంలో 8 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

నెల్లూరు రూరల్: జిల్లాలో జరిగే ఏపీపీఎస్సీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె ఉదయభాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 25 నుండి 27 వరకు జరిగే పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్‌ఓ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్‌లోని అయాన్ డిజిటల్ సెంటర్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, కావలిలోని విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ ప్రతినిధి గిరిజారాణి, పరీక్షా కేంద్రాల కళాశాలల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాల్పుల కలకలంలో నిందితుల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఆస్తి వివాదం నేపథ్యంలో తన తండ్రి ఇంటికి వెళ్లి తండ్రి, సోదరుడిపై గన్‌తో కాల్చిన ఘటనలో నిందితులను చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు సమాచారం మేరకు.. నగరంలోని రావూరివారివీధిలో రాజమాల్ జైన్‌కు ఆయన రెండో కుమారుడు హితేష్‌జైన్ మధ్య ఆస్తి విభేదాలున్నాయి. 22వ తేదీ అర్ధరాత్రి హితేష్ తన స్నేహితులైన గాంధీనగర్‌కు చెందిన వంశీ, మూలాపేటకు చెందిన భరత్, పొదలకూరురోడ్డుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి, కోనేటిమిట్టకు చెందిన శేఖర్ సందీప్ అలియాస్ శ్రీనివాస్‌శేఖర్, కిశోర్‌తో కలిసి తండ్రి ఇంటికి వెళ్లి హితేష్ తన వద్ద ఉన్న పిస్టోల్‌తో తలుపుపై కాల్పులు జరిపిన విషయం విదితమే. రాజమల్ జైన్ పెద్ద కుమారుడు దిలీప్‌కుమార్ జైన్ ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి పిస్టోల్‌తోపాటు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్, క్రైమ్ పార్టీ ఏఎస్‌ఐ శ్రీహరి, రవిప్రసాద్, హెచ్‌సీలు సురేష్, నజ్మల్, కానిస్టేబుల్స్ శ్యామ్, సుబ్బారావు, వర్ధన్‌లను ఎస్పీ అభినందించారు.

టీడీపీ నాయకుల గూండాగిరి

- వైఎస్సార్‌సీపీ మహిళా నేత కుటుంబంపై దాడి
- కర్రలు, రాళ్లతో స్వైరవిహారం
- భయంతో ఇంట్లో తలదాచుకున్న బాధితులు
- దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్
- స్థల వివాదం మునుగులో కక్షసాధింపు చర్య
- వేదాయపాళెం పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నెల్లూరు సిటీ: జిల్లాలో అధికార అండతో టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారు. నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో పోతురాజు మురళి, రమాదేవి దంపతులు నివసిస్తున్నారు. వారికి ఆకాష్, లక్ష్మీదేవి సంతానం. రమాదేవి వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్నారు. వీరు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేశారు. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు పోతురాజు రవి, అతని అనుచరులు వారిపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం వనంతోపు సెంటర్‌కు సమీపంలో ఓ స్థలానికి సంబంధించి పోతురాజు గంగయ్య, సునీతలు కొలతలు వేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న టీడీపీ నేత పోతరాజు రవి, అతని బంధువులు గంగమ్మ, రమ, ఓబిలి సుజాత, విజయసారథి, రాజేష్, మురళి, శిరీషలు ఆ స్థలంపై తమకూ హక్కు ఉందంటూ కొలతలు ఆపాలని వారిని అడ్డుకున్నారు. అక్కడ వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమీపంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పోతురాజు మురళి దంపతులు గంగయ్యకు మద్దతుగా వచ్చారు. దాంతో టీడీపీ నేత పోతురాజు రవి, అతని వర్గీయులు మురళి కుటుంబంపై దాడికి దిగారు. దాదాపు 20 మంది ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డంతో మురళి, రమాదేవిలు గాయపడ్డారు. భయంతో వెంటనే తమ పిల్లలతో సహా ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని తలదాచుకున్నారు. దాడి చేసిన వారు వెళ్లిపోయిన తరువాత బాధితులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వేదాయపాళెం పోలీసులకు ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు.



దాడికి ఉపయోగించిన కర్ర, రాయిని చూపుతున్న బాధితురాలు పోతురాజు రమాదేవి



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శ

వైఎస్సార్‌సీపీ నేత మురళి దంపతులపై టీడీపీ నాయకుల దాడిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రూరల్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలు ఖండించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ సౌజన్యను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. దాడికి సంబంధించిన వీడియోలను పోలీసులకు అందజేశారు. వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మా బిడ్డ ఎప్పుడొస్తుందో..?

- తల్లిదండ్రుల ఆవేదన
- పక్షం రోజులుగా ఆచూకీ లేని మహిళ



వెంకటరమణ (ఫైల్)

ఉలవపాడు: దాదాపు 15 రోజుల క్రితం తప్పిపోయిన వివాహిత ఆచూకీ ఇంత వరకు లభ్యం కాలేదు. కుమార్తె ఆచూకీ లేక తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పోలీసు శాఖ కేసు నమోదు చేసినా ఇంత వరకు ఆచూకీ కనిపెట్టలేకపోయారు. ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామంలో ఈ నెల 7వ తేదీన ఈ సంఘటన జరిగింది. వీరేపల్లి అంబేడ్కర్ నగర్‌కు చెందిన చొప్పర వెంకట రమణకు (31) వివాహమైంది. భర్త మరణించడంతో తల్లిదండ్రులు చొప్పర శ్రీను, వరలక్ష్మి వద్ద ఉంటోంది. ప్రతి రోజూ వీరేపల్లి నుంచి ప్రకాశం జిల్లా శింగరాయకొండలోని దేవి సీఫుడ్స్‌లోకి పనికి బస్‌లో వెళ్లి వస్తుంది. 7వ తేదీ తెల్లవారుజామున గ్రామంలో ఓ వివాహం జరుగుతున్న సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చింది. తరువాత నుంచి ఇంటికి రాలేదు. ఇంటి దగ్గర లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులు, తమ్ముడు వెతుకులాడారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 8న మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు కొంత విచారణ జరిపినా ఫలితం లేకుండా పోయింది. నేటికీ ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు పెళ్లి జరుగుతున్న సమయంలో ఉన్న కొందరిని విచారించారు. ఆమె పనిచేసే ప్రాంతానికి వెళ్లి విచారించి వచ్చినా ఫలితం లేదు. పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసుపై మరింత దృష్టి సారించి తమ కుమార్తె ఆచూకీ తెలపాలని బాధితులు కోరుతున్నారు.

సహనాన్ని చేతికానితనం అనుకోవద్దు

- తిరగబడే రోజు వస్తుంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి, రూరల్ సమన్వయకర్త ఆనం
- కూటమి ప్రభుత్వ అరాచకాలపై ఏఎస్పీకి వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు

నెల్లూరు సిటీ: టీడీపీ నాయకులు తమ సహనాన్ని చేతకాని తనం అనుకోవద్దని, తిరగబడే రోజు వస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, రూరల్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు పోలీసులను ఉపయోగించుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శ్రీనివాస్ యాదవ్‌పై స్పష్టమైన ఆధారాలు లేకుండా అక్రమ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. అక్రమ కేసులతో భయపెట్టాలని అధికార పార్టీ యోచిస్తోందని తెలిపారు. వైకాపా మహిళా విభాగం నేత రమాదేవి ఇంటి మీదకు వెళ్లి టీడీపీ నేతలు దాడి చేస్తే, ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. వారి కుటుంబంపై దాడికి సంబంధించిన వీడియోలు బయటపెట్టినా పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు యంత్రాంగం విఫలం అయిందన్నారు. అధికార పార్టీ పెడుతున్న కేసులకు భయపడి, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అధికార పార్టీ అరాచకాలను ఎదుర్కొంటామని తాము కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ సహనాన్ని చేతికాని తనం అనుకోవద్దని, త్వరలో తిరగబడే రోజు వస్తుందని పేర్కొన్నారు. నగరంలోని పోలీసు గ్రీవెన్స్‌లో సోమవారం ఏఎస్పీ సౌజన్యకు కాకాణి, ఆనం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్‌లో రౌడీయిజం ఎక్కువైంది. మాట వినకపోతే దాడులు లేదంటే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి చేసి వారి మీదే కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. రూరల్‌లో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే దమ్ములేక దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు.



ఏఎస్పీ సౌజన్యకు వినతి పత్రం ఇస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలు

నా మద్యం షాపును హ్యాండోవర్ చేసుకోండి

- లైసెన్స్ ఇవ్వకుండా సొంత పార్టీ వారే అడ్డుకున్నారు
- రూ.14 లక్షలు నష్టపోయా
- సీఈఓకి టీడీపీ కార్యకర్త కడియపు లక్ష్మి విన్నపం

నెల్లూరు(అర్బన్): ఆమె టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్నారు. లాటరీలో ఆమెకు మద్యం దుకాణం వచ్చింది. ఎక్సైజ్ సీఐ లైసెన్సు ఇవ్వకుండా సొంత పార్టీ వారే అడ్డుకున్నారు. తీవ్ర ఇబ్బందులుకు గురి చేస్తున్నారు. ఆమె తీవ్రంగా నష్టపోయింది. అప్పులు తీర్చే క్రమంలో తాళిబొట్టు అమ్ముకుంది. చివరికి మద్యం షాపు తనకు వద్దు ప్రభుత్వం హ్యాండోవర్ చేసుకుని విముక్తి చేయాలని ప్రాధేయపడుతోంది. ఆమె పేరు కడియపు లక్ష్మి. పొదలకూరు మండలంలోని తాటిపర్తి వాసి. సోమవారం కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈఓకి వినతిపత్రం ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మి ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయానికి పనిచేశారు. గత సంవత్సరం మద్యం షాపులకు తీసిన లాటరీలోకి ఆమెకు 154 నంబర్ షాపు దక్కింది. పొదలకూరులో దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు తుమ్మల శ్రీనివాసులు అనే వ్యక్తి షాపును అద్దెకు తీసుకుని అడ్వాన్స్ కింద రూ.లక్ష చెల్లించింది. అగ్రిమెంట్ రాసుకున్నాను. అయితే ఎక్సైజ్ సీఐ, సూపరింటెండెంట్‌లు లైసెన్సు ఇవ్వలేదు. పైగా అద్దెకు షాపు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసులును ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా రోడ్డులోకి జరిగి షాపు కట్టావంటూ అధికారపార్టీ నాయకులు బెదిరించారు. ముగ్గురి వద్ద షాపులు అద్దెకు తీసుకుని అడ్వాన్స్‌లు చెల్లించింది. వారిని అలాగే బెదిరించారు. అడ్వాన్స్ రూపంలో చెల్లించిన రూ.3 లక్షలు నగదు కూడా ఇంకా ఆమెకు రాలేదు. లైసెన్సు కోసం ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ తిరిగా.. ఆడ మనిషి అని కూడా చూడకుండా సీఐ ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో నిలబెట్టారు. చివరికి ఆమెకు వ్యాపారం జరగని సూరాయపాళెం గ్రామంలో ప్రొవిజనల్ లైసెన్స్ ఇచ్చారు. అక్కడ వద్దని ఎంత చెప్పినా భయపెట్టారు. లక్ష్మి రెండు నెలలకు మద్యం దుకాణానికి ప్రభుత్వానికి ఫీజు కింద రూ.10,83,330 చెల్లించాల్సి ఉంది. ఆమెకు రెండు నెలలకు రూ.3 లక్షలు మాత్రమే వస్తోంది. ప్రభుత్వానికి నగదు ఎలా చెల్లించాలని అడుగుతోంది. ఎక్సైజ్ సీఐకు చెబితే నేనేమి చేయలేను. అధికారపార్టీ ఒత్తిళ్లు ఉన్నాయని చెబుతున్నాడని ఆమె వాపోతోంది. అప్పులు తీర్చేదానికి తాళిబొట్టు కూడా అమ్మేశాను. ఇప్పటికే రూ.14 లక్షలు నష్టపోయాను. మా పార్టీ వారి వల్లనే ఇలా జరిగింది. అందువల్ల ప్రభుత్వం నా దుకాణాన్ని హ్యాండోవర్ చేసుకోవాలి. లేదంటే పొదలకూరులో లైసెన్స్ ఇవ్వాలి. అలా చేయకపోతే నాకు పురుగు మందే దిక్కు అని వాపోయింది.



జెడ్పీ సీఈఓ విద్యారమకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కడియపు లక్ష్మి (వృత్తంలోని మహిళ)

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్): పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో సైదాపురం మండలం చాగణం ఎర్రసంగం ప్రాంతానికి చెందిన సరెడ్డి సుబ్రహ్మణ్యం (21)కు జీవిత ఖైదుతో పాటు రూ.22,500 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు బాధిత బాలిక తండ్రి సమీప జేప్లాపురం గ్రామంలోని ఓ కంపెనీలో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేసేవాడు. ఈ నేపథ్యంలో 2021 ఏప్రిల్ 29 ఉదయం 11 గంటలకు బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లారు. బాధిత బాలిక చెల్లెలుతో ఆరు బయట చెట్టు కింద ఆడుకొంటోంది. ఇంట్లో ఎవరూ లేని విషయం గమనించిన నిందితుడు సుబ్రహ్మణ్యం బాలికకు మామిడికాయలు ఇస్తానని మాయమాటలు చెప్పి సమీపంలోని జామాయిల్ తోటలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాలిక ఇంటికి వచ్చి తల్లికి ఈ విషయం చెప్పింది. ఈ ఘటనపై అదే రోజు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సైదాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడు సుబ్రహ్మణ్యంపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.

ఆవేదనలు.. అరణ్య రోదనలు

- కలెక్టరేట్‌కు 309 ప్రజావిజ్ఞప్తులు
- ప్రతి వారం వందల సంఖ్యలో అర్జీలు
- పరిష్కారం కావడం లేదని కన్నీటి పర్యంతరం



ఊటుకూరులో దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

నెల్లూరురూరల్: 'సార్ మేము ఇక్కడికి వస్తున్నాము.. మీరు మా అర్జీలను కింద స్థాయి అధికారులకు పంపిస్తున్నారు. అక్కడికి వెళ్తే సమాధానం కూడా చెప్పడం లేదు. మీ దగ్గరకు వస్తేనే మా సమస్యలు పరిష్కారం కాకపోతే ఇంకెవరి దగ్గరికి వెళ్లాలి. కొంచెం మా పై దయచూపి పరిష్కారం అయ్యేలా చూడండి' అంటూ బాధితులు కలెక్టరేట్ అధికారులను గద్గద స్వరంలో కన్నీటి పర్యంతమయ్యారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చారు. వినతులు పరిష్కరించాలని తమ గోడు వెళ్లబోసుకున్నారు. జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు అర్జీలు స్వీకరించారు.

ఊటుకూరు దళితులకు భూములు అప్పగించాలి

- **ఎస్. మల్లి, న్యాయవాది, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు**

విడవలూరు మండలం ఊటుకూరులో దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని వారి భూములు వారికి అప్పగించాలని న్యాయవాది, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి జేసీకి వినతిపత్రం అందజేశారు. ఎస్.మల్లి మాట్లాడుతూ 2018లో ఊటుకూరుకు చెందిన పలువురు దళితులకు ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబరు 1288 నుంచి 1294 వరకు 90.26 ఎకరాలు కొని ఇచ్చారని తెలిపారు. రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదన్నారు. స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్ రెండో సారి కూడా అక్కడే పోస్టింగ్ వేయించుకుని భూములను దళితులకు దక్కనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 50 ఎకరాలు భూ కబ్జాదారులు ఆక్రమించుకుని పంటలు పండించుకుంటున్నారన్నారు. అద్దంకి కార్తీక్, పీ పాపయ్య మాట్లాడుతూ దాదాపు రూ.8 కోట్ల విలువైన భూములు 8 ఏళ్లుగా సాగుబడి చేసుకుని లబ్ధిపొందుతున్నారని తెలిపారు. తక్షణం జోక్యం చేసుకుని సర్వే చేసి, హద్దులు చూపించి సాగు చేపట్టేందుకు వీలు కల్పించాలని కోరారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జేసీ కార్తీక్ దళిత నేతలకు హామీ ఇచ్చారు. ఆత్మకూరు కొండయ్య, ఇమ్మానియల్, శివాజీ, జెడ్డా వాసు తదితరులు ఉన్నారు.

రాయితీలు త్వరగా ఇవ్వండి

అట్రాసిటీకి గురైన బాధితులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు త్వరగా ఇవ్వాలని రిపబ్లిక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహబూబ్ సోమవారం జేసీకికు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో అట్రాసిటీకి గురైన బాధితులకు ఇంత వరకు రాయితీలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బత్తల మధుసూదన్, అరికొండ సురేష్, నిమ్మల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి

– జేసీ కార్తీక్

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం 309 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయి. ఇందులో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 138, మున్సిపల్ శాఖవి 33, సర్వేకు 30, పంచాయతీ రాజ్ శాఖ 21, స్కూల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 9 అర్జీలు అందాయన్నారు. వీటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశించారు.

మా బతుకులు అన్నింటికి చెడ్డ రేవడిలా

మా బతుకులు అన్నింటికి చెడ్డ రేవడిలా మారాయని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్నామన్నారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్నా తమ కేడర్ తెలియక, కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తింపు లేక ఆరోగ్య మిత్రులు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీసు అసోసియేట్లు తదితరులు ఇబ్బంది పడుతున్నామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎలాంటి బెనిఫిట్లు రావడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవన్నారు. ప్రభుత్వ సైట్లలో ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు ఉండడం వల్ల సంక్షేమ పథకాలు రావడం లేదన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులకు వినితిపత్రం అందజేశారు.


సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న వైద్యసేవ ఫీల్డ్ అసిస్టెంట్లు

నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమణలు


వి రమేష్‌రెడ్డి

కొత్తూరు బిట్–2 సర్వే నంబరు 21, 73, 21, 74లో కండలేరు జలాశయం ముంపు బాధితుల పునరావాస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కె కాంతారావు అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని స్థానికుడు వి.రమేష్‌రెడ్డి జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021లో 150 మందికి పట్టాలు మంజూరు చేసిందన్నారు. ప్రతి 20 కుటుంబాలకు తాగునీటికి ఒక బావి నిర్మించిందన్నారు. కొందరు ఆ బావులను ధ్వంసం చేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పొలం ఆక్రమించారు



నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులో తనకు రావాల్సిన పొలాన్ని తన మరిది చిరంజీవి ఆక్రమించుకున్నాడని తాడిపర్తి రజనిమ్మ అనే మహిళ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీకి వినతిపత్రం అందజేసింది. తన భర్త చనిపోయిన తర్వాత తన పేరుతో ఉన్న పట్టా భూమిని తనకు తెలియకుండానే వీఆర్‌ఓతో కలిసి అతని పేరు మీదకు 1బీ, అడంగళ్‌లో ఎక్కించుకున్నారని వాపోయారు. నా కూతురు చదువుకునే స్కూల్ దగ్గరకు వెళ్లి బెదిరిస్తున్నాడని తెలిపారు. నాకు ఏమైనా జరిగితే అతనిదే బాధ్యత అని కన్నీటి పర్యంతయ్యారు.

మా గోడు విని ఆదుకోండి

- పోలీసు గ్రీవెన్స్‌లో 86 ఫిర్యాదులు


పోలీసు గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు సిటీ: హనీ ట్రాప్‌తో వేధిస్తునారు.. స్వామీజీ పేరుతో లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు.. వివాహం చేసుకుంటానని ఓ మహిళ మోసగించిందని, నకిలీ పత్రాలతో స్థలాన్ని కాజేస్తున్నాడంటూ ఇలా.. పలువురు తమ గోడును జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి 86 మంది తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి ఆదుకోవాలని కోరారు. జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని సంబంధిత ప్రాంతాల పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఉమెన్ పీఎస్ డీఎస్పీ సీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

హనీట్రాప్‌లో రూ.18 లక్షలు తీసుకున్నారు

ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన దుర్గాభవాని అనే మహిళ తన స్నేహితులతో కలిసి హనీట్రాప్ చేసి తన నుంచి రూ.18 లక్షలు తీసుకుంది. తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని వీకేపాడుకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు.

నా స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారు

నెల్లూరురూరల్ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో రాంరాజ్ కంపెనీ పేరుతో సతీష్, సురేష్ అనే ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు తనను నమ్మించారు. 67 అంకణాల తన స్థలాన్ని ముత్తుకూరుకు చెందిన శకుంతలమ్మ అనే మహిళకు నకిలీ పత్రాల ద్వారా అమ్మేశారు. తన స్థలంలో గోడ కూడా కట్టారని, విచారించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

స్వామీజీ పేరుతో వేధిస్తున్నారు

కావలి మండలం పూలదొరువులో శక్తి పూజలు చేస్తానని పవన్‌కుమార్, అతని భార్య రజిని కలిసి తనన్ని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, తాము చెప్పింది చేయకపోతే నీ భర్తకు హాని కలిగేలా చేస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు. తన నుంచి రక్షించి న్యాయం చేయాలని కోరారు.

పెళ్లి చేసుకుంటానని రూ.4.50 లక్షలు తీసుకుంది

వేదాయపాళెం పరిధికి చెందిన వ్యక్తి తన భార్య కోవిడ్‌లో మరణించగా, జీవిత భాగస్వామి కోసం మ్యాట్రిమోనియల్ సైట్‌లో నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో నంద్యాలకు చెందిన కౌసల్య అనే మహిళ తనను వివాహం చేసుకుంటానని నమ్మించి అవసరాలకు రూ.4.50 లక్షలు తీసుకొని మోసం చేసిందని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఫిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మోసం

టీపీగూడూరుకు చెందిన వ్యక్తి తన బిడ్డకు ఫిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ సీట్ ఇప్పిస్తానని, ఏజెంట్ రవితేజ తనను నమ్మించి రూ.21లక్షలు నగదు తీసుకొని, కాలేజీలో అసలు ఫీజు కట్టలేదని, మోసపోయామని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

మినీ వాహనం బోల్తా

వరికుంటపాడు: అరటి పండ్ల లోడుతో వేగంగా వెళ్తున్న మినీ వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడిన ఘటన సోమవారం భోగ్యంవారిపల్లి- రామాపురం మార్గంలో జరిగింది. వైఎస్సార్ జిల్లా బద్వేలు నుంచి అరటి కాయల లోడుతో ఒంగోలుకు వెళుతోంది. భోగ్యంవారిపల్లి సమీపంలోకి వచ్చే సరికి మినీ వాహనం టైర్ పంక్చర్ అయింది. డ్రైవరు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులకు సమాచారం అందలేదు.


అదుపు తప్పి బోల్తాపడిన మినీ వాహనం

గురుకుల ప్రవేశపరీక్ష వాయిదా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పరీక్ష తేదీ వాయిదా పడినట్లు జిల్లా సమన్వయకర్త టి.పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా వేశామన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు.

మైనింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి పంచాయతీలో ఉన్న 'రుస్తుం' మైన్‌లో 2023లో అక్రమంగా మైనింగ్ చేశారంటూ వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డి, కొండా శివారెడ్డిలపై తప్పుడు కేసు నమోదు చేశారు. సోమవారం పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి వారిద్దరిని అరెస్ట్ చేసి గూడూరు కోర్టులో హాజరు పరగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఈ కేసులో 10 మంది పేర్లను చేర్చారు. వీరిలో ఇద్దరిని అరెస్ట్ చూపించారు. గత నెల 16వ తేదీన జిల్లా మైనింగ్ డీడీ బాలాజీనాయక్ పొదలకూరు పోలీస్‌స్టేషన్లో అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ .75
సన్నవి	రూ. 55
పండ్లు	రూ. 30



మద్యంలో సరికొత్త డీల్

- దుకాణాలు, బార్ల యజమానుల మధ్య కొత్త ఒప్పందం
- బార్‌లో క్వార్టర్ బాటిల్‌పై రూ.60 అదనంగా పెంచి విక్రయాలు
- వచ్చిన ఆదాయంలో చెరిసగం పంచుకునేలా అవగాహన
- ఇదేం దోపిడీరా బాబూ అంటున్న మందుబాబులు


మాచవరంలో నిర్వహిస్తున్న బెల్టుషాపు

కందుకూరు: కందుకూరులో మద్యం వ్యాపారం సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఆదాయమే పరమావధిగా మందుబాబుల జేబులు గుల్లచేసే సరికొత్త విధానానికి మద్యం వ్యాపారులు తెరతీశారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న సామెతగా మద్యంషాపుల యజమానులు, బార్ల యజమానులు ఓ అవగాహనకు వచ్చి భారీ దోపిడీకి స్కెచ్ వేశారు. దీంతో మందుబాబులు నిలువుదోపిడీకి గురౌతున్నారు. కందుకూరు పట్టణంలో అమలవుతున్న ఈ సరికొత్త విధానంపై మందుబాబు ఇదేం దోపిడీ అంటూ లబోదిబోమంటున్నారు.

ఇదీ ఒప్పందం

కందుకూరు నియోజకవర్గంలో మొత్తం 21 ప్రైవేట్ మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో 17షాపులు మద్యం వ్యాపారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటే, మరో 4 షాపులు గౌడ కులస్తులకు కేటాయించినవి. అయితే గౌడ కులస్తుల షాపులను కూడా సిండికేట్ వ్యాపారులు స్వాధీనం చేసుకుని నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రధానంగా కందుకూరు పట్టణంలో 7 మద్యం షాపులు ఏర్పాటు చేశారు. మరో మూడు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. మద్యం షాపులకు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులే సిండికేట్‌గా ఏర్పడి దక్కించుకుని నిర్వహించుకుంటున్నారు. నిన్నటి వరకు వేళాపాళా లేకుండా ఇష్టం వచ్చినట్లు మద్యంషాపులు నిర్వహించుకుంటూ దోపిడీ చేస్తూ వస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు లూజ్ సేల్స్ చేయడంతో పాటు, సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా వ్యాపారం నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఈ విషయంలో అధికారులు, షాపుల యజమానుల మధ్య కొంత వివాదం నడుస్తోంది. అదే సమయంలో మద్యం షాపుల్లో విచ్చలవిడి అమ్మకాల వల్ల పట్టణంలోని బార్‌ల యజమానులకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో మద్యంషాపుల యజమానులు, బార్ల యజమానులు కలిసి ఓ అవగాహనకు వచ్చి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా మద్యంషాపుల్లో లూజ్ సేల్ విక్రయించకూడదు, అదనపు సిట్టింగ్ రూమ్‌లను ఎత్తివేయాలి వంటి షరతులు ఉన్నాయి. బార్ల యజమానులు చేసిన ప్రతిపాదనకు మద్యంషాపుల యజమానులు అంగీకరించారు. దీనికి ప్రతిఫలంగా బార్లలో మద్యం బాటిల్స్ రేట్లను ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. ఉదాహరణకు క్వార్టర్ బాటిల్‌పై రూ.60 అదనంగా బార్ యజమానులు వసూల్ చేస్తారు. ఇలా క్వార్టర్ బాటిల్‌పై అదనంగా వసూల్ చేసిన 60 రూపాయల్లో రూ.30 మద్యంషాపుల యజమానులకు ఇచ్చేటట్లు, రూ.30 బార్‌ల యజమానులు తీసుకునేలా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని గత వారం రోజులుగా పట్టణంలో అమలు చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం మద్యం షాపులో లూజ్‌సేల్ అమ్మకాలు, అదనపు రూమ్‌లను తీసివేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మందుబాబులు కచ్చితంగా బార్‌లకు వెళ్లాల్సి వస్తోంది. బార్‌లకు వెళ్లి క్వార్టర్ బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.60 చెల్లించాల్సి వస్తోంది. ఇలా ప్రతి రోజు పట్టణంలోని మూడు బార్లలో 2వేల క్వార్టర్ బాటిళ్ల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. అంటే బార్ యజమానులు ఒక రోజు అదనపు దోపిడీ రూ.1.20 లక్షలు. దీనిలో రూ.60 వేలు మద్యంషాపుల యజమానులకు ఇస్తే, మిగిలిన రూ.60 వేలు బార్ యజమానులకు దక్కుతుంది.

అంత ఇచ్చుకోలేం సార్

అదే సందర్భంలో మద్యంషాపుల యజమానులు, ఎక్సైజ్, పోలీస్‌శాఖల అధికారుల మధ్య కూడా మామూళ్ల విషయంలో పొత్తు కుదరడం లేదని సమాచారం. అధికారులు అడిగినంత ఇచ్చుకోలేక నిబంధనల మేరకు షాపులు నిర్వహించుకునేందుకు మద్యంషాపుల యజమానులు సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. నిన్న, మొన్నటి వరకు అదనపు సిట్టింగ్ రూమ్‌లతో పాటు, రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అమ్మకాలు సాగించిన పట్టణంలోని మద్యంషాపులు సడన్‌గా రూటు మార్చాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 10గంటల వరకు అమ్మకాలు సాగిస్తూ, లూజ్‌సేల్స్, అదనపు రూమ్‌లను పూర్తిగా రద్దు చేశారు. దీనికి ప్రధాన కారణం అధికారులకు ఇచ్చే మామూళ్ల విషయంలో అంగీకారం కుదరలేదని ప్రచారం సాగుతుంది. అధికారులు అడిగినంత ఇచ్చేందుకు షాపుల యజమానులు ససేమిరా అంగీకరించడం లేదు. ఒక్కో షాపుకు నెలకు రూ.25 వేలు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తుండగా, షాపుల యజమానులు మాత్రం రూ.15వేలు ఇస్తామంటూ మొండికేస్తున్నారు. ఈ మామూళ్ల విషయంలో ఇరువర్గాల మధ్య రాజీకుదరకపోవడంతో నిబంధనల ప్రకారం షాపులు నిర్వహించుకునేందుకు పట్టణంలోని మద్యంషాపుల యజమానులు సిద్ధమయ్యారు. అయితే దీనికి బదులుగా బార్ల యజమానుతో కొత్త ఒప్పందం చేసుకుని సరికొత్త దోపిడీకి స్కెచ్ వేశారు. అయితే మొత్తం వ్యవహారంలో మందుబాబులే జేబులు గుల్లచేసుకుంటున్నారు.

వందలకొద్దీ బెల్టుషాపులు

అయితే కందుకూరు పట్టణం మినహా ఇతర ప్రాంతాల్లోని మద్యంషాపుల్లో ఇష్టం వచ్చినట్లు బెల్టుషాపులు నిర్వహించుకుంటున్నారు. మద్యంషాపుల నుంచే నేరుగా బెల్టుషాపులకు ఆటోలు, కార్ల ద్వారా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ప్రతి గ్రామంలో నాలుగు వరకు బెల్టుషాపులు నిర్వహిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. గుడ్లూరులో రెండు మద్యంషాపులు ఉండగా వీటిలో ఒకటి కేవలం బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసేందుకు కేటాయించినట్లు సమాచారం. ఈ విధానం ప్రకారం ప్రస్తుతం నియోజకవర్గంలో బెల్టుషాపు లేని గ్రామం లేదంటే ఆశ్చర్యం కలగక మానదు. అయితే ఎక్సైజ్ అధికారులుగాని, పోలీస్‌శాఖ అధికారులు గాని ఈ బెల్టు షాపుల జోలికి మాత్రం పోవడం లేదు.

అటవీ శాఖ ట్రాప్ కెమెరాల చోరీ

ఉదయగిరి: మండలంలోని కొత్తపల్లి బీట్ పరిధిలో దిరసనమాను బండ అటవీ ప్రాంతం నీటికుంట వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ట్రాప్ కెమెరాలు చోరీకి గురైన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. అటవీ ప్రాంతంలో వేటగాళ్ల, జంతువుల కదలికలను తెలుసుకునేందుకు ఉదయగిరి అటవీశాఖ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆ శాఖ అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అడవుల్లో వేట సాగిస్తున్న వారు ఈ కెమెరాలు చోరీ చేసి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చోరీ విషయమై రేంజ్ అధికారి బీఎస్ కుమార్‌రాజాను వివరణ కోరగా కెమెరా చోరీ జరిగింది వాస్తవమేనని, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

డాక్టర్ శ్రావణికి ప్రతిష్టాత్మక అవకాశం


డాక్టర్ శ్రావణి

వెంకటాచలం: వీఎస్‌యూ పూర్వవిద్యార్థిని డాక్టర్ బతినపట్ల శ్రావణి ప్రతిష్టాత్మక 74వ లిండా నోబెల్ లారియట్ సమావేశంలో పాల్గొనే అవకాశం దక్కడంతో వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. శ్రావణి వీఎస్‌యూలో ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) పూర్తి చేసి కడపలోని యోగివేమన వర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఎంకే పోస్ట్- డాక్టోరల్ ఫెలోగా పని చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 29 నుంచి జూలై 4 తేదీ వరకు జర్మనీలోని లిండా నగరంలో జరగనున్న 74వ లిండా నోబెల్ లారియట్ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా పాల్గొనే 600 మంది యువ శాస్త్రవేత్తల్లో ఒకరిగా డాక్టర్ శ్రావణి ఎంపికైంది.